

చీనీ టన్ను రూ.19 వేలు
అనంతపురం మార్కెట్‌యార్డులో బుధవారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.19 వేలు, కనిష్టంగా రూ.9 వేల ప్రకారం ధర పలికాయి.



కిలో టమాట రూ.42
అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో బుధవారం కిలో టమాట గరిష్టంగా రూ.42, కనిష్టంగా రూ.34 ప్రకారం ధర పలికింది. మార్కెట్‌కు 3,450 టన్నుల టమాట వచ్చింది.

గరిష్టం/కనిష్టం 32.9°/20.4°
జిల్లాలో బుధవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి వర్షం కురిసింది. గంటకు 8 నుంచి 14 కి.మీ వేగంతో గాలి వీచింది.

మాఫియా గుప్పిట్లో రేషన్

పేదల కోసం ప్రభుత్వాలు అందిస్తున్న బియ్యాన్ని కొందరు కొట్టుకెళ్తున్నారు. మాఫియా అవతారమెత్తి రూ. కోట్లు గడిస్తున్నారు. ఇదంతా అధికారులకు తెలియదా? అంటే తెలుసనే చెప్పాలి. మామూళ్ల మత్తులో కళ్లుమూసుకున్నారనే విమర్శలున్నాయి.

- 'పుష్ప' సినిమాలో ఎర్రచందనం తరహాలో బియ్యం దందా
- ఉమ్మడి అనంతలో ఆర్కే పేరు చెబితే హడల్
- విజిలెన్స్ నుంచి పోలీసు వరకూ చిట్టీ చూపిస్తే వాహనం వదలాల్సిందే
- ఉమ్మడి అనంతకు వచ్చే బియ్యంలో సగం కర్ణాటకకే
- మామూళ్ల మత్తులో విజిలెన్స్, పోలీసులు



ఇటీవల యాడికి మండలకేంద్రంలో అధికారులు పట్టుకున్న రేషన్ బియ్యం బస్తాలు (ఫైల్)

సాక్షి ప్రతినిధి, అనంతపురం: కూటమి సర్కారు వచ్చిన దగ్గర నుంచి పీడీఎస్ బియ్యం మాఫియా పేట్రేగిపోతోంది. శ్రీ సత్యసాయి, అనంతపురం జిల్లాలకు వచ్చే బియ్యంలో సగం బయటి రాష్ట్రాలకే వెళుతోంది. దీనివెనుక మాఫియా డాన్‌లు ఉన్నట్టు తెలుస్తోంది. వీరికి టీడీపీ ఎమ్మెల్యేలు సహకరిస్తున్నట్టు సమాచారం. ప్రతి ఇరవై ఇళ్లకు ఒకరు సేకరించి ఒకచోటకు చేర్చేటంత నెట్‌వర్క్ ఉందంటే ఈ వ్యవహారం ఎంతవరకూ వెళ్లిందో అంచనా వేయొచ్చు.

ఆరితేరిన 'ఆర్కే'..

బియ్యం అక్రమ రవాణా అంటే రామకృష్ణ (ఆర్కే) పేరు వినిపిస్తుంది. ఇతనిది పెనుకొండ నియోజకవర్గం సోమందేపల్లి. బియ్యం అక్రమ రవాణాకు ఇతనే డాన్. అనంతపురంలో టీవీ టవర్ వద్ద, రాప్తాడు నియోజకవర్గం కందుకూరు, ఉరవకొండ నియోజకవర్గం కూడేరు, ధర్మవరం నియోజకవర్గంలో మరో ఏరియా ఇలా సుమారు 15 వరకూ భారీ డంప్‌లు ఏర్పాటు చేసుకుని అక్రమ రవాణా చేస్తున్నారు. గతంలో వ్యాపారులు సేకరించిన బియ్యాన్ని నేరుగా బంగారుపేట, పావగడకు తీసుకెళ్లేవారు. ఇప్పుడు ఎవరైనా ఇలా బియ్యాన్ని సేకరిస్తే ఆర్కేకే ఇవ్వాలి. ఈయన కాకుండా సుబ్రమణ్యం శెట్టి, సుబ్బు, మాధవి, ఆచారి లాంటి వాళ్లు దందాలో భాగస్వాములుగా ఉన్నారు. 'పుష్ప' సినిమాలో ఎర్రచందనం తరహాలో బియ్యం పక్కరాష్ట్రాలకు తరలిస్తున్నారు.

అధికారులతో మిలాఖత్

ఉమ్మడి అనంతపురం జిల్లాకు నెలకు 18,500 మెట్రిక్ టన్నుల రేషన్ బియ్యం వస్తుండగా.. 9 వేల మెట్రిక్ టన్నులు బయటి రాష్ట్రాలకే అక్రమ రవాణా అవుతున్నాయి. విజిలెన్స్, పోలీసు, సివిల్ సప్లయిస్ ఇలా మూడు విభాగాల అధికారులకు బియ్యం అక్రమరవాణా డాన్‌లు మామూళ్లు ఇస్తున్నారు. నియోజకవర్గాల వారీగా ముట్టజెబుతున్నారు. ప్రతి చెక్‌పోస్టుకూ నెలకు రూ.1.50 లక్షలు ఇస్తున్నట్టు తేలింది. ఇక విజిలెన్స్ వారికి నియోజకవర్గానికి రూ.1.50 లక్షల నుంచి రూ.1.80 లక్షల వరకూ ఇస్తున్నట్టు సమాచారం. దీంతోనే ఎన్ని చెక్ పోస్టులు పెట్టినా బియ్యం సరిహద్దులు దాటిపోతున్నాయి.

డ్రైవర్లు కేసుల్లో.. డాన్‌లు కలుగుల్లో

లబ్ధిదారులతో ఏజెంట్లు కేజీ రూ.18కి కొని, పెద్ద వ్యాపారులకు రూ.22కు అమ్ముతారు. వీటిని బంగారుపేట, పావగడల్లోని రైస్‌మిల్లుల్లో పాలిష్ చేసి కేజీ రూ.28 నుంచి రూ.30కి ముంబైతో పాటు పలు నగరాలకు తరలిస్తారు. ఇలా ఏటా ఇలా రూ.వందల కోట్ల వ్యాపారం జరుగుతోంది. వైఎస్సార్ కడప, అనంతపురం, శ్రీ సత్యసాయి.. ఈ మూడు జిల్లాల బియ్యమూ కర్ణాటకకు వెళుతున్నాయి.

ఈ ఏడాది బుక్ అయిన కొన్ని బియ్యం కేసులు

జిల్లా	తేదీ	సీజ్ అయిన బియ్యం
శ్రీ సత్యసాయి	జనవరి 20	34 క్వింటాళ్లు
అనంతపురం	ఫిబ్రవరి 20	130 క్వింటాళ్లు
అనంతపురం	మే 5	315 క్వింటాళ్లు
అనంతపురం	జూన్19	134 క్వింటాళ్లు
అనంతపురం	జులై 3	99 క్వింటాళ్లు
శ్రీ సత్యసాయి	జులై18	235 క్వింటాళ్లు
అనంతపురం	ఆగస్ట్ 4	100 క్వింటాళ్లు

అయితే, రోజూ ఎక్కడో చోట విజిలెన్స్ అధికారులు పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్నట్టు వార్తలొస్తాయి. బియ్యం రవాణా చేసే వాహనాల డ్రైవర్‌పై కేసు నమోదు చేస్తారు. ఆ తర్వాత ఏమీ ఉండదు. కానీ అసలు డాన్‌లు ఎవరు, దీని వెనకాల ఏం నడుస్తోంది అన్నది పోలీసులు గానీ, విజిలెన్స్ కానీ విచారణ చేయడం లేదు. ఏదో ఫైన్‌లు రాయడం, అప్పటి కప్పుడు వదిలేయడం చేస్తున్నారు.

అనంతపురం జిల్లాలో

జిల్లాలో రైస్ కార్డులు	6,60,330
చౌకదుకాణాలు	1,645
నెలకు వచ్చే బియ్యం	9,967 మెట్రిక్ టన్నులు

శ్రీ సత్యసాయి జిల్లాలో

జిల్లాలో రైస్ కార్డులు	5,76,632
చౌకదుకాణాలు	1,367
నెలకు వచ్చే బియ్యం	8,600 మెట్రిక్ టన్నులు

న్యూస్‌రీల్

యూరియా కోసం ఆందోళన చెందొద్దు



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ చేతన్

పుట్టపర్తి అర్బన్: యూరియా కోసం రైతులెవరూ ఆందోళన చెందవద్దని కలెక్టర్ చేతన్ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో వ్యవసాయశాఖకు సంబంధించిన అంశాలపై ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... రైతులకు అవసరమైన యూరియా సరఫరా చేస్తామన్నారు. ప్రస్తుతం 4,700 టన్నుల యూరియా అందుబాటులో ఉందన్నారు. యూరియాను వ్యవసాయేతర అవసరాలకు వాడకుండా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. కృత్రిమ కొరత సృష్టించినా, పారిశ్రామిక అవసరాలకు మళ్లించినా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో వ్యవసాయ శాఖ అధికారి సుబ్బారావు, పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ నాగరాజు, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి వంశీకృష్ణారెడ్డి, ట్రాన్స్‌పోర్ట్ అధికారి ఉదయ్‌కుమార్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారి మహేష్, లేబర్ ఆఫీసర్ సూర్యనారాయణ, పశువైద్యాధికారి సుభదాస్ తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోండి

అనంతపురం ఎడ్యుకేషన్: స్థానిక కేఎస్ఎన్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో యూజీ ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ఈ మేరకు ఆ కళాశాల ప్రిన్సిపాల్ కేసీ సత్యలత బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. బీఏ, బీఎస్సీ, బీకాం కోర్సులు అందుబాటులో ఉన్నాయి. ఆసక్తి ఉన్న విద్యార్థినులు ఈ నెల 26వ తేదీ లోపు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.

అర్హులందరికీ ఉచిత న్యాయ సహాయం

- జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రాజశేఖర్



హిందూపురం సబ్‌జైలులోని ఓ ఖైదీతో మాట్లాడుతున్న జడ్జి రాజశేఖర్

హిందూపురం/ధర్మవరం అర్బన్: సబ్‌జైలులో ఉన్న ముద్దాయిల్లో అర్హులందరికీ కచ్చితంగా ఉచిత న్యాయ సహాయం అందిస్తామని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రాజశేఖర్ తెలిపారు. బుధవారం ఆయన హిందూపురం, ధర్మవరం సబ్‌జైళ్లను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జైలు రికార్డులను పరిశీలించి ముద్దాయిలతో నేరుగా వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎంతకాలంగా సబ్‌జైలులో ఉంటున్నారు... ఏ నేరంపై సబ్‌జైలుకు వచ్చారు..తదితర వివరాలు ఆరా తీశారు. అలాగే ములాఖత్ ద్వారా కుటుంబీకులతో మాట్లాడే అవకాశం కల్పిస్తున్నారా.. తరచూ న్యాయవాదులు బంధువులతో మాట్లాడే అవకాశం ఉంటోందా అని అడిగారు. అలాగే వసతి, భోజన సౌకర్యాలపై ఖైదీలతో, సబ్‌జైలు అధికారులతో చర్చించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, న్యాయవాదులను ఏర్పాటు చేసుకోలేని ముద్దాయిలు దరఖాస్తు చేసుకుంటే 48 గంటల్లోపు ఉచితంగా న్యాయవాదులను ఏర్పాటు చేస్తామన్నారు. సబ్‌జైలులో ఎలాంటి సమస్యలున్నా ఫిర్యాదు చేయాలన్నారు. సబ్‌జైలు అధికారులు ఏమైనా ఇబ్బందులుపెట్టినా...సౌకర్యాలు కల్పించకపోయినా, వైద్య సహాయం అందించడంలో నిర్లక్ష్యం వహించినా నేరుగా ఫిర్యాదు చేయవచ్చన్నారు. తర్వాత ఆయన జైలు గదులను పరిశీలించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. హిందూపురం సబ్‌జైలర్ హనుమన్న, ధర్మవరం సబ్‌జైలు ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ శివరామకృష్ణయ్య, న్యాయవాదులు నవేరా, బాల త్రిపుర సుందరి, లోక్ ఆదాలత్ సిబ్బంది హేమావతి, పారా లీగల్ వలంటీర్ సురేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉగ్రవాదుల సమాచారం పోలీసులకు తెలపండి



మాట్లాడుతున్న డీఎస్పీ హేమంత్‌కుమార్

ధర్మవరం అర్బన్: పాకిస్తాన్ ఉగ్రవాదుల, ఉగ్రవాద గ్రూపులతో సంబంధం ఉన్న వారి గురించి తెలిస్తే పోలీసులకు సమాచారం అందించాలని డీఎస్పీ హేమంత్‌కుమార్ ప్రజలను కోరారు. బుధవారం స్థానిక డీఎస్పీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. పాకిస్తాన్ ఉగ్రవాదులతో సంబంధాలున్నట్లు తెలిసినా, ఉగ్రవాదానికి ప్రేరేపించే వ్యక్తులు ఎక్కడైనా కనిపించినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. సమాచారం ఇచ్చిన వారి పేర్లను గోప్యంగా ఉంచుతామన్నారు. ఉగ్రవాదుల సమాచారం తెలిపిన వారికి పోలీసు శాఖ తరపున బహుమతులు కూడా అందిస్తామన్నారు. సమాచారం ఇవ్వాలనుకునే వారు 9440796831 (ధర్మవరం వన్ టౌన్ పోలీస్‌స్టేషన్ సీఐ), 6305800429 (టూ టౌన్ పోలీస్‌స్టేషన్ సీఐ), 9440796832 (ధర్మవరం రూరల్ పోలీస్‌స్టేషన్ సీఐ) నంబర్లను సంప్రదించాలని సూచించారు.

ఉపాధిలో మాయాజాలం

- చిలమత్తూరు పంచాయతీలో ఈ నెల 5వ తేదీన 10 మంది కూలీలు ఉపాధి హామీ పనులకు వెళ్లారు. ఫీల్డ్ అసిస్టెంట్ చలపతి వారి ఫొటోలు తీసి ఆన్‌లైన్‌లో అప్లోడ్ చేశారు. మళ్లీ అవే ఫొటోలు మరో రెండు మస్టర్లకు అటాచ్ చేసి అప్లోడ్ చేశాడు. దీంతో అక్కడ పనిచేసిన వారు 10 మంది అయితే మరో 20 మంది కూడా పనిచేసినట్లు మాయాజాలం చేశాడు.
- నాలుగురోజుల కిందట చిలమత్తూరు మండలంలోని దిగువపల్లి తండాలో ఉపాధి కూలీలు పనిచేయగా... ఫీల్డ్ అసిస్టెంట్ ఆన్‌లైన్‌లో హాజరు నమోదు చేసి కూలీల ఫొటో తీసి అప్లోడ్ చేశారు. మళ్లీ అదే ఫొటో ఉపయోగించి వేర్వేరు పేర్లతో ఉన్న మరో మస్టర్‌కు జతచేసి అప్లోడ్ చేశాడు.

.. ఇలా జిల్లా వ్యాప్తంగా దందా సాగుతోంది. కూలీలు 10 మంది పనిచేస్తే 30 నుంచి 40 మందికి కూలి డబ్బులు వచ్చేలా ఫీల్డ్ అసిస్టెంట్లు మాయాజాలం చేస్తున్నారు. ఉపాధి హామీ జాబ్‌కార్డు ఉంటే చాలు కూలి డబ్బులు పడేలా చేస్తున్నారు. ఇందుకుగాను వచ్చిన కూలి డబ్బుల్లో సగం వాటా తీసుకుంటున్నారు.



చిలమత్తూరు పంచాయతీలో వేర్వేరు పేర్లకు ఒకే ఫొటో ఎంట్రీ చేసిన దృశ్యం

- హాజరు నమోదులో అవకతవకలు
- ఒక మస్టర్ గ్రూపు ఫొటోను మరో మస్టర్‌కు అప్లోడ్ చేస్తున్న వైనం
- పనులు చేయనివారికీ బిల్లులు.. రూ.లక్షల్లో స్వాహా

చిలమత్తూరు: వలసలు నివారించేందుకు ప్రవేశపెట్టిన జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అక్రమార్కులకు వరంగా మారింది. ఫీల్డ్ అసిస్టెంట్లు మస్టర్లలో మాయాజాలం చేస్తుండగా... పనిచేయని వారికీ బిల్లులు మంజూరవుతున్నాయి. ఇలా వచ్చిన మొత్తాన్ని వాటాలు పంచుకుంటున్నారు.

హాజరు ఆన్‌లైన్ చేసినా ఆగని దందా

'ఉపాధి' నిధులు పక్కదారి పట్టకుండా కేంద్రం చర్యలు తీసుకుంది. కూలీల హాజరును ఏరోజుకు ఆరోజు ఆన్‌లైన్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది. అలాగే వారి గ్రూప్ ఫొటోను ఎన్ఆర్ఈజీఎస్ మొబైల్ మానిటరింగ్ సిస్టం (ఎన్ఎంఎంఎస్)లో మస్టర్ల వారీగా నమోదు చేయాల్సి ఉంటుంది. అయినప్పటికీ ఫీల్డ్ లెవల్ అధికారులు కొత్త దందాకు తెరతీశారు. ఒక మస్టర్ కింద పనిచేసిన 10 మంది కూలీల ఫొటో, వివరాలు యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. మరో మస్టర్‌లో పనిచేయని కూలీల వివరాలు నమోదు చేసి పనిచేసిన కూలీల ఫొటోను దానికి అప్‌లోడ్ చేసేస్తున్నారు. ఒకే ఫొటోలో ఒకరిద్దరిని స్థానాల్ని మార్చి ఫొటోలు తీసి ఆన్‌లైన్ చేస్తున్నారు. దీంతో పనులు చేయని వారికీ బిల్లులు పడుతున్నాయి. ఆ డబ్బును కూలీలకు నామమాత్రంగా ఇచ్చి మిగిలినది అధికారులు పంచుకుంటున్నట్టుగా తెలుస్తోంది.

ఒక్క మండలంలోనే 140 మందికి బిల్లులు

చిలమత్తూరు మండలంలో 2 వేల జాబ్ కార్డులున్నాయి. 600 మంది దాకా పనిచేస్తున్నారు. వీరిలో పనిచేయకుండా బిల్లులు పొందుతున్న వారు 140 మంది దాకా ఉన్నట్టుగా తెలుస్తోంది. రోజూ ఒక్కొక్క కూలీకి రూ.280 ఈ లెక్కన 140 మందికి రోజుకు రూ.39,200 కాగా 100 రోజులకు రూ.39.20 లక్షల అవినీతి జరుగుతున్నట్టుగా స్పష్టంగా తెలుస్తోంది. ఈ లెక్కన జిల్లా వ్యాప్తంగా ఎంత సొమ్ము దుర్వినియోగం అవుతుందో అంచనా వేసుకోవచ్చు. ఈ సొమ్ము కిందిస్థాయి నుంచి పైస్థాయి వరకూ పంచుకుంటున్నట్టుగా ఆరోపణలు వినిపిస్తున్నాయి.



చిలమత్తూరు మండలం తమ్మినాయనపల్లి వద్ద ఉపాధి పనులు చేస్తున్న కూలీలు (ఫైల్)

హడలెత్తుతున్న సబ్ రిజిస్ట్రార్లు

- చెప్పింది చెయ్యకపోతే బదిలీపై వెళ్లిపోతారంటూ ఎమ్మెల్యేల హెచ్చరికలు
- పెద్ద రిజిస్ట్రేషన్ వస్తే తమకు తెలియజేయాలని హుకుం
- ప్రతినెలా మామూళ్లివ్వాలని కొంతమంది ఎమ్మెల్యేల అల్టిమేటం
- విలవిలలాడుతున్న సబ్‌రిజిస్ట్రార్లు



సాక్షి ప్రతినిధి, అనంతపురం: 'పచ్చ' నేతల దెబ్బకు ఉమ్మడి జిల్లాలో సబ్ రిజిస్ట్రార్లు బెంబేలెత్తుతున్నారు. అసలే రిజిస్ట్రేషన్ ఆదాయం పడిపోయి అల్లాడుతుండగా తాజాగా ఎమ్మెల్యేల ఒత్తిడి ఎక్కువైపోయిందంటూ వాపోతున్నారు. తాము చెప్పినట్టు రిజిస్ట్రేషన్లు చెయ్యకపోతే శంకరగిరి మాన్యాలు పట్టిస్తామని ఎమ్మెల్యేలు బెదిరిస్తున్నారు. అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాల్లో పెద్ద రిజిస్ట్రేషన్లు తమకు తెలియకుండా చేయకూడదని చెబుతున్నారు.

పర్సెంటేజీలు ముట్టజెబితేనే..

ఎక్కడైనా కొద్దో గొప్పో బిల్డర్లు స్థలాలు లేదా భూములు కొని రిజిస్ట్రేషన్‌కు వెళ్లాలంటేనే భయపడుతున్నారు. కోటి రూపాయలకు మించి ఎలాంటి రిజిస్ట్రేషన్ వచ్చినా ముందుగా ఎమ్మెల్యేకు సమాచారం ఇవ్వాలి. స్వయంగా కొన్ని చోట్ల సబ్‌రిజిస్ట్రార్‌లే 'ఎమ్మెల్యేను కలిసి రండి' అని కొనుగోలుదారుడికి చెబుతున్నారంటే పరిస్థితి అంచనా వేయొచ్చు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 19 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లోనూ ఇదే పరిస్థితి. మున్సిపాలిటీల పరిధిలో పెద్ద పెద్ద భవనాలకు రిజిస్ట్రేషన్లు జరగాలన్నా ఎమ్మెల్యేల అనుమతి ఉండాల్సిందేనని సబ్‌రిజిస్ట్రార్లు చెబుతున్నారు.

అక్కడ భారీగా ఒత్తిళ్లు..

అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాల్లో ప్రధానంగా కొన్ని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అధికారులపై తీవ్ర ఒత్తిడి ఉన్నట్టు వాపోతున్నారు. అనంతపురం అర్బన్, అనంతపురం రూరల్,కదిరి,కళ్యాణదుర్గం, రాప్తాడు, తాడిపత్రి ప్రాంతాల్లో ఎక్కువ ఇబ్బందులున్నట్టు చెబుతున్నారు. కొన్ని చోట్ల ఒక సారి రిజిస్ట్రేషన్ అయిన భూములను కూడా రెండో సారి చేయాలని ఒత్తిడి తెస్తున్నారు. ఒత్తిళ్ల కారణంగానే ఇటీవల అనంతపురం నగరంలో 'అస్రా' కంటి అద్దాల షాపు రిజిస్ట్రేషన్ రెండో సారి జరిగినట్టు తెలిసింది.

కదిరి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో అంతా అడ్డగోలుగా..

కదిరిలో ముడుపులు లేనిదే ఒక్క రిజిస్ట్రేషన్ కూడా జరగడం లేదు. విచిత్రమేమంటే పుట్టపర్తి నియోజకవర్గానికి సంబంధించిన మూడు మండలాలు కదిరి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం పరిధిలోకి వస్తాయి. కానీ ఈ మూడు మండలాల రిజిస్ట్రేషన్లకు సంబంధించి పుట్టపర్తి ఎమ్మెల్యే చెప్పినట్టు జరగడం లేదు. కదిరి ఎమ్మెల్యే చెబితేనే పనవుతుందని అక్కడి టీడీపీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ధర్మవరం, శింగనమల నియోజకవర్గాల్లోనూ ఖరీదైన భూములైతే ప్రజాప్రతినిధుల చేయి తడిపాకే పనవుతోంది. లేదంటే సబ్‌రిజిస్ట్రార్ కొర్రీలేసి జాప్యం చేస్తున్నారు. ఎమ్మెల్యేల ఒత్తిడి కారణంగా సబ్‌రిజిస్ట్రార్లు కూడా వినియోగదారుల నుంచి పిండుకుంటున్నారు. దీంతోనే ఏడాదిలో ఒక్క సబ్ రిజిస్ట్రార్ అయినా ఏసీబీకి పట్టుబడుతున్నారు. గతంలో ఎప్పుడూ లేనంతగా ఎమ్మెల్యేల ఒత్తిడి ఉన్నట్టు సబ్‌రిజిస్ట్రార్లు చెబుతుండడం గమనార్హం.



ఇది ధర్మవరం నుంచి కృష్ణాపురం గ్రామం మీదుగా ముదిగుబ్బకు వెళ్లే రహదారి. ఈ రహదారిపై 20 గ్రామాలకు చెందిన వారు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. కొందరు టీడీపీ నేతలు ఎర్రకొండలోని గరుసుమట్టిని తవ్వి టిప్పర్లలో ఈ దారి గుండా అక్రమంగా రవాణా చేస్తున్నారు. అధిక టన్నేజీతో వాహనాలు తిరుగుతుండటంతో రహదారి ఛిద్రమవుతోందని ఆయా గ్రామాలకు చెందిన వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గుంతలు పడిన రహదారిలో ప్రయాణం నరకంగా మారిందని వాపోతున్నారు.


ఎర్రకొండకు ఎసరు!

గరుసు కోసం ఎర్రకొండను కరిగిస్తున్న టీడీపీ నేతలు

- రవాణా కోసం పొలాల్లో అడ్డదిడ్డంగా దారుల ఏర్పాటు
- టిప్పర్ మట్టిని రూ.7 వేలకు విక్రయిస్తూ భారీగా ఆర్జన
- చోద్యం చూస్తున్న అధికార యంత్రాంగం



మల్లాకాలువ సమీపంలోని ఎర్రకొండలో గరుసు మట్టిని తవ్వుతున్న యంత్రం



గరుసు మట్టితో ధర్మవరంలోని ఓ వెంచర్‌కు వెళ్తున్న టిప్పర్

ధర్మవరం రూరల్: రాష్ట్రంలో కూటమి సర్కార్ కొలువుదీరిన తర్వాత టీడీపీ నేతలు దోచుకోవడమే పనిగా పెట్టుకున్నారు. ఈ క్రమంలో కొందరు నేతలు సహజ వనరులపై కన్నేసి కొల్లగొడుతున్నారు. కాసులకోసం కొండలనే కరిగిస్తున్నారు. ఎర్రమట్టి కోసం కొందరు టీడీపీ నేతలు ధర్మవరం మండలం మల్లాకాలువ గ్రామ సమీపంలోని ఎర్రకొండపై కన్నేశారు. పగలు, రాత్రి తేడా లేకుండా యంత్రాలతో కొండ నుంచి గరుసు తవ్వి తరలిస్తుండగా... క్రమంగా కొండ కనుమరుగవుతోంది. ఇందుకు ఎలాంటి అనుమతులు లేకపోయినా... అధికారులు అటువైపు కన్నెత్తి చూడటం లేదు.

ఆ నలుగురే కీలకం..

ధర్మవరంలో వెంచర్లు వేస్తున్న వారు గుంతలు పూడ్చటం, మట్టిరోడ్లు వేసేందుకు ఎక్కువగా గరుసు మట్టిని వాడుతున్నారు. దీంతో గరుసుకు ఫుల్ డిమాండ్ ఏర్పడింది. దీంతో నలుగురు టీడీపీ నాయకులు మట్టి మాఫియాగా మారారు. మల్లాకాలువ గ్రామ సమీపంలోని ఎర్రకొండలోని గరుసు మట్టిని యంత్రాలతో తవ్వి టిప్పర్లు, ట్రాక్టర్ల ద్వారా పట్టణంలోని ప్రైవేట్ 'రియల్' వెంచర్లకు రవాణా చేస్తున్నారు. ఇందుకోసం ఒక్కో ట్రాక్టర్ నుంచి రూ.1,000, టిప్పర్ నుంచి రూ.7 వేలు వసూలు చేస్తూ రూ.లక్షలు ఆర్జిస్తున్నారు.

పేదల భూముల్లో రహదారులు

రోజూ పదుల సంఖ్యలో ట్రాక్టర్లు, టిప్పర్లు ఎర్రకొండ వద్దకు వెళ్తున్నాయి. ఈక్రమంలో సదరు టీడీపీ నాయకులు వాహన రాకపోకల కోసం రైతుల పొలాల్లో అడ్డదిడ్డంగా దారి వేశారు. దీంతో పొలాల్లోని మట్టి గట్టిగా మారి సాగుకు పనికిరాకుండా పోతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పొలాల్లో వెళ్లకూడదని పేద రైతులు వేడుకున్నా.... అవేమీ పట్టించుకోవడం లేదు. మరోవైపు గరుసు మట్టి ట్రాక్టర్లు, టిప్పర్లు నిత్యం తిరుగుతుండటంతో రహదారులు ఛిద్రమవుతున్నాయని పట్టణ వాసులు ఆరోపిస్తున్నారు. ఈ విషయమై ఇటీవల రెవెన్యూ, పోలీసులకు కూడా ఫిర్యాదు చేసినట్లు రైతులు చెబుతున్నారు.

కన్నెత్తి చూడని అధికారులు

గరుసు మట్టిని పగలు, రాత్రి తేడా లేకుండా టీడీపీ నేతలు అక్రమంగా తరలిస్తున్నా.. అధికారులు అటువైపు కన్నెత్తి చూడటం లేదు. ట్రాక్టర్లు, టిప్పర్ల ద్వారా మట్టి యథేచ్ఛగా పట్టణానికి సరఫరా అవుతున్నా.. అధికారులకు కనిపించకపోవడం ఏమిటని ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి మట్టి తవ్వకాలను అడ్డుకోవాల్సిన అవసరం ఉంది.

జిల్లా కేంద్రాన్ని తరలిస్తే ఉద్యమమే

- బావమరిది అడిగాడని జిల్లా కేంద్రాన్ని మారిస్తే ఊరుకోం
- సమావేశంలో పట్టణ ప్రముఖులు, వైఎస్సార్‌సీపీ నాయకులు


సమావేశంలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ నాయకులు, పట్టణ ప్రముఖులు

పుట్టపర్తి అర్బన్: జిల్లా కేంద్రాన్ని పుట్టపర్తి నుంచి తరలిస్తే ఉద్యమిస్తామని కూటమి ప్రభుత్వాన్ని పట్టణ ప్రముఖులు, వైఎస్సార్‌సీపీ నాయకులు హెచ్చరించారు. బుధవారం పుట్టపర్తిలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి డీఎస్ కేశవరెడ్డి ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, పట్టణ ప్రముఖులు సమావేశమై మాట్లాడారు. సత్యసాయిబాబా చిరకాల కోరికైన జిల్లా ఏర్పాటుతో నాడు సంబరాలు చేసుకున్న భక్తులు ప్రస్తుతం ఆందోళనకు గురవుతున్నారన్నారు. లక్షలాది మంది భక్తులు, కార్మికులు, కర్షకులు, పారిశ్రామిక వేత్తల మనోభావాలు దెబ్బతినేలా కూటమి ప్రభుత్వం జిల్లాల మార్పును తెరపైకి తీసుకురావడం బాధాకరమన్నారు. ఈ అంశంపై స్థానిక ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి నోరు విప్పాలన్నారు. 32 మండలాలకు కేంద్ర బిందువుగా ఉన్న పుట్టపర్తి నుంచి జిల్లా కేంద్రం మారిస్తే చారిత్రాత్మక తప్పిదమవుతుందన్నారు. బావమరిది, హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ అడిగారని జిల్లా కేంద్రాన్ని సీఎం చంద్రబాబు మారిస్తే చూస్తూ ఊరుకోబోమని అన్నారు.

సొంత భవనాలు సమకూర్చిన ట్రస్ట్

పుట్టపర్తిలో సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ సొంత భవనాలను ప్రభుత్వ కార్యాలయాల సమకూర్చిందని గుర్తు చేశారు. పుట్టపర్తిలో విమానాశ్రయం, రైల్వే, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి, అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో కూడిన విద్యాసంస్థలకు తోడు పరిశ్రమల ఏర్పాటుకు పారిశ్రామిక వేత్తలు ముందుకు వస్తున్నారన్నారు. ఇవన్నీ పూర్తయితే సుమారు రూ.5 వేల కోట్ల మేర ఆదాయం ప్రభుత్వ ఖజానాకు చేరుతుందన్నారు. అప్పట్లో ఎంపీ, అందరు ఎమ్మెల్యేలకృషితో సాధించుకున్న జిల్లా కేంద్రాన్ని సులువుగా వదులుకోబోమన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాల నుంచి ఒక రికార్డు కానీ, వస్తువు కానీ తరలించకుండా ప్రతిఘటిస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తుంగ ఓబుళపతి, వైఎస్సార్‌సీపీ కన్వీనర్లు రవినాయక్, ఈశ్వరయ్య, కేశవ, ఆదినారాయణరెడ్డి, లక్ష్మీరెడ్డి, బుక్కపట్నం ఎంపీపీ శ్రీధర్‌రెడ్డి, రాష్ట్ర మహిళా కార్యదర్శి సాయిలీలారెడ్డి, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సుధాకరరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు కేశప్ప, బీసీ సెల్ సంయుక్త కార్యదర్శి పోరకల రమణ, రాష్ట్ర వాణిజ్య విభాగం ప్రధాన కార్యదర్శి కుర్లి నర్సిరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి చెరువు భాస్కరరెడ్డి, రాష్ట్ర రైతు విభాగం కార్యదర్శి రంగారెడ్డి, రాష్ట్ర మైనార్టీ కార్యదర్శి ఎస్‌హెచ్ బాషా, అగ్రి బోర్డు మాజీ చైర్మన్ ఆవుటాల రమణారెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి ఫొటో సాయి, రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు రామసుబ్బారెడ్డి, ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు బిల్డర్ మల్లికార్జున, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు నారాయణప్ప, జిల్లా కార్యదర్శులు రఘునాథ్, మధుసూదన నాయుడు,, కౌన్సిలర్ పవన్‌కుమార్, నియోజకవర్గ అధ్యక్షురాలు కన్యాకుమారి, పెన్ననర్ల విభాగం అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, డాక్టర్ల విభాగం అధ్యక్షుడు హనుమంతరెడ్డి, మహిళా అధ్యక్షురాలు భారతి, నాయకులు గంగాద్రి, గోవర్ధనరెడ్డి, శ్రీధర్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, యూత్ నాయకులు సందీప్‌నాయుడు, రుషికేశవరెడ్డి, రంగారెడ్డి, కడప రాజా, తిమ్మప్ప, సతీష్‌నాయుడు, సురేష్‌నాయుడు, రామయ్య, రంగప్ప, రామస్వామి నాయక్, సర్పంచులు జగన్‌మోహన్ చౌదరి, గోవిందరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా కేంద్రం మారిస్తే ఉద్యమిస్తాం



ఇప్పుడిప్పుడే జిల్లా కేంద్రం ఫలాలు సామాన్యులకు అందుతున్నాయి. అన్ని మండలాలకు నడిబొడ్డులో ఉన్న పుట్టపర్తిని కాదని కూటమి ప్రభుత్వం జిల్లా కేంద్రాన్ని పుట్టపర్తి నుంచి మారిస్తే ఉద్యమిస్తాం.
– సాయిలీలా, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మహిళా కార్యదర్శి, పుట్టపర్తి

అధికార పక్షం నోరు విప్పాలి



జిల్లా కేంద్రం మార్పుపై ప్రజలు వివిధ రకాలుగా చర్చించుకుంటున్నా అధికార పార్టీ ప్రజాప్రతినిధులు నోరు విప్పడం లేదు. జిల్లా కేంద్రం తరలిస్తే కూటమి నాయకులకు పుట్టగతులుండవు.ఇది లక్షలాది మంది మనోవాంఛ.
– సందీప్‌నాయుడు, పెద్దకమ్మవారిపల్లి

అన్ని మండలాలకు కేంద్ర బిందువు



జిల్లాలోని 32 మండలాలకు కేంద్ర బిందువుగా ఉన్నందునే నాడు పుట్టపర్తిని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జిల్లా కేంద్రంగా ఏర్పాటు చేశారు. సత్యసాయి భక్తుల మనోభావాలతో కూటమి నాయకులు ఆడుకుంటున్నారు. ప్రభుత్వ కార్యాలయాలను తరలిస్తే అడ్డుకుంటాం. అందరూ కలిసి శక్తి వంచన లేకుండా పోరాటం చేస్తాం. – లక్ష్మీరెడ్డి, ఓడీసీ

సకల సౌకర్యాలు ఉన్నాయి



ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రంగా విరాజిల్లుతున్న పుట్టపర్తిలో జిల్లా కేంద్రానికి అనువైన అన్ని సౌకర్యాలూ ఉన్నాయి. రైలు మార్గం, విమానాశ్రయం, నాణ్యమైన వైద్యం, అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలు కలిగిన విద్యాసంస్థలు, నీటి వసతి, ఇతర మౌలిక సదుపాయాలన్నీ ఉన్నాయి. అయినా జిల్లా కేంద్రం మార్పు చేస్తామనడం దుర్మార్గమైన చర్య.
– రవినాయక్, వైఎస్సార్‌సీపీ పుట్టపర్తి కన్వీనర్

క్లుప్తంగా

మహిళలను పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దండి

- సెర్ప్ సీఈఓ వాకాటి కరుణ



మాట్లాడుతున్న వాకాటి కరుణ

పుట్టపర్తి అర్బన్: మహిళలను పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దాలని సంబంధిత అధికారులను గ్రామీణ పేదరిక నిర్మూలన సంఘం (సెర్ప్) సీఈఓ వాకాటి కరుణ ఆదేశించారు. వెలుగు కార్యాక్రమాలపై బుధవారం పుట్టపర్తిలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఉమ్మడి జిల్లా వెలుగు సిబ్బందితో ఆమె సమీక్షించారు. మహిళా సాధికారతకు కృషి చేయాలని, మహిళా సంఘాల్లో లెక్కల్లో కచ్చితత్వం ఉండేలా కృషి చేయాలని సూచించారు. మహిళల్లో ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను గుర్తించి, వారికి అన్ని రకాల సహాయ సహకారాలు అందించాలన్నారు. పీఎంఈజీపీ, పీఎంఎఫ్‌ఎంఈ తో పాటు ఇతర రుణాలు అందించి పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దాలన్నారు. కార్యక్రమంలో ఉన్నతి హెచ్‌డీ డైరెక్టర్ శివశంకరప్రసాద్, డీఆర్‌డీఏ పీడీలు నరసయ్య, శైలజ, ఉమ్మడి జిల్లా డీపీఎంలు, ఏపీఎంలు, సీసీలు పాల్గొన్నారు. అంతకు ముందు ప్రశాంతి నిలయంలో సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు. అనంతరం కలెక్టర్ చేతన్‌ను కలసి పుష్పగుచ్ఛం అందజేసి, మాట్లాడారు.

దేవాలయ భూములను సంరక్షించాలి

- ఎండోమెంట్ రీజనల్ జాయింట్ కమిషనర్ చంద్రశేఖర్ ఆజాద్

కదిరి టౌన్: దేవాలయ భూములను సంరక్షించాలని సంబంధిత అధికారులను దేవదాయ శాఖ రీజనల్ జాయింట్ కమిషనర్ ఎస్ఎస్ చంద్రశేఖర్ ఆజాద్ ఆదేశించారు. ఆలయ భూముల అంశంపై జిల్లాతో పాటు వైఎస్సార్ కడప జిల్లా దేవదాయ శాఖ అధికారులతో కదిరిలోని ఎంజీ రోడ్డులో ఉన్న ధ్యాన మందిరంలో డిప్యూటీ కమిషనర్ పట్టెం గురుప్రసాద్‌తో కలసి బుధవారం ఆయన సమీక్షించారు. ఆలయ భూముల సంరక్షణకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. దేవదాయ పర్యవేక్షణాధికారి నరసింహరాజు, ఆలయ ఈఓ వి.శ్రీనివాసరెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

వ్యక్తి బలవన్మరణం

తనకల్లు: మండలంలోని గుర్రంబైలు నివాసి నాగరాజు (39) ఆత్మహత్య చేసుకున్నాడు. వ్యవసాయంతో జీవనం సాగిస్తున్న ఆయనకు ఇద్దరు పిల్లలున్నారు. కొద్ది రోజులుగా మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో బుధవారం టమాట తోటలోని టేకు చెట్టుకు డ్రిప్పు పైప్‌తో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు పరిశీలించి, కేసు నమోదు చేశారు.

విద్యుదాఘాతంతో వ్యవసాయ కూలీ మృతి


తలారి రాజన్న (ఫైల్)

కనగానపల్లి: విద్యుత్ షాక్‌కు గురై ఓ వ్యవసాయ కూలీ మృతి చెందాడు. స్థానికులు తెలిపిన మేరకు.. కనగానపల్లి మండలం బద్దలాపురం గ్రామానికి చెందిన సీపీఐ అనుబంధ వ్యవసాయ కూలీ సంఘం మండల కార్యదర్శి తలారి రాజన్న (56)కు భార్య సరోజమ్మ, ఐదుగురు కుమార్తెలు ఉన్నారు. వ్యవసాయ కూలి పనులతో కుటుంబాన్ని పోషించుకునేవాడు. కనగానపల్లిలో బుధవారం చేపట్టిన చెరువు కట్ట మరమ్మతు పనుల్లో కొలతలు గుర్తించేందుకు ఇరిగేషన్ అధికారుల పిలుపు మేరకు రాజన్న దినసరి కూలికి వెళ్లాడు. విద్యుత్ లైన్ కింద కొలతలు తీస్తుండగా అతను పట్టుకున్న స్టాపర్ (స్టీల్ రాడ్) విద్యుత్ తీగలకు తగిలి షాక్‌కు గురై కిందపడ్డాడు. ఇరిగేషన్ సిబ్బంది గుర్తించి స్థానిక పీహెచ్‌సీకి తరలించేలోపు మృతి చెందాడు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. కాగా, తెలుసుకున్న రైతు సంఘం నాయకులు మహదేవ్, గోవిందు, మల్లికార్జున, పలువురు సీపీఐ నాయకులు ధర్మవరంలోని ప్రభుత్వాస్పత్రిలోని మార్చురీకి వెళ్లి మృతుడు రాజన్న మృతదేహాన్ని పరిశీలించి, నివాళులర్పించారు.

యువకుడి ఆత్మహత్య

లేపాక్షి: ఖాళీగా ఇంటి పట్టున ఉండకుండా ఏదైనా పని చూసుకోవాలని తల్లి హితవు పలకడంతో క్షణికావేశానికి లోనై ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు.. అనంతపురం జిల్లా కళ్యాణదుర్గం నివాసి భూదేవికి కర్ణాటకలోని గౌరీబిదనూరుకు చెందిన రవిచంద్రకుమార్‌తో వివాహమైంది. వీరికి ఇద్దరు కుమారులు. 15 సంవత్సరాల క్రితం భర్తను వదిలేసి ఇద్దరు కుమారులతో కలసి లేపాక్షి మండలం తిలక్‌నగర్‌కు వలస వచ్చిన ఆమె ఓ ఇల్లు నిర్మించుకుని ఇక్కడే స్థిరపడ్డారు. పెద్ద కుమారుడు గౌరీబిదనూరులో పనిచేస్తుండగా, రెండో కుమారుడు ఆకాష్ (28) కియా కంపెనీలో పనికి వెళ్లేవాడు. 3 నెలలుగా పనికి వెళ్లకుండా ఇంటి పట్టునే ఉండడంతో ఏదైనా పని చూసుకోవాలని, పనికి పోకపోతే జీవనం ఎలా సాగుతుందని తల్లి మంగళవారం మందలించింది. అనంతరం సాయంత్రం భూదేవి గౌరీబిదనూరుకు వెళ్లింది. ఆ సమయంలో ఇంట్లో ఒంటరిగా ఉన్న ఆకాష్ ఫ్యాన్‌కు చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పక్కింటి వారి నుంచి సమాచారం అందుకున్న భూదేవి రాత్రికి రాత్రే ఇంటికి చేరుకుని కుమారుడి మృతదేహాన్ని చూసి బోరున విలపించింది. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

ఖరీఫ్ పంటల పరిశీలన


కొత్తచెరువు వద్ద రాగి పంటను పరిశీలిస్తున్న అధికారులు

పుట్టపర్తి అర్బన్: జిల్లాలో ఖరీఫ్‌లో సాగు చేసిన వివధ రకాల పంటలను కదిరి వ్యవసాయ పరిశోధనా స్థానం శాస్త్రవేత్త డాక్టర్ రమేష్ నాయక్, ఏరువాక శాస్త్రవేత్త డాక్టర్ రామసుబ్బయ్య, ఏడీ కృష్ణమీనన్ తదితరులు పరిశీలించారు. పుట్టపర్తి, కొత్తచెరువు, సోమందేపల్లి మండలాల్లోని పలు గ్రామాల్లో బుధవారం వారు పర్యటించారు. రైతులతో కలసి పంటలను పరిశీలించారు. చీడపీడలు, ఎరువుల వినియోగం, తదితర విషయాలపై పలు సూచనలు చేశారు. బోర్ల కింద ముందస్తుగా సాగు చేసిన వేరుశనగలో మచ్చ తెగులు, కాండము కుళ్లు ఆశించినట్లుగా గుర్తించారు. నివారణకు ఎక్సాకొనజోల్ 2ఎంఎల్ మందును లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. ప్రత్యామ్నాయ పంటల కింద ఉలవ, జొన్న, పెసర, అలసందలు విత్తుకోవాలని సూచించారు. కంది పంటలో సాళ్లు ఒత్తుగా ఉంటే 20 సెంటీమీటర్లకు ఒక మొక్క ఉంచి మిగిలినవి తొలగించాలన్నారు. మొక్కజొన్న పంటలో 30, 40, 60 రోజులకు ఎకరాకు 50 కిలోల యూరియా పైపాటుగా వేసుకోవాలన్నారు. వరిలో కాలి బాటలు వదలాలన్నారు. రాగికి మంచి గిట్టుబాటు ధరలు ఉన్నాయని వర్షాల ఉంచి పంటను సంరక్షించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆయా మండలాల విస్తరణాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

తొలి రోజు ఇద్దరు.. రెండో రోజు ముగ్గురు

- జెడ్పీ శిక్షణ తరగతులకు స్పందన కరువు


జెడ్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన శిక్షణకు హాజరైన ముగ్గురు మహిళా ప్రజాప్రతినిధులు, అధికారులు లేక బోసిపోతున్న వేదిక

అనంతపురం సిటీ: అనంతపురంలోని జెడ్పీ కార్యాలయంలో నిర్వహిస్తున్న శిక్షణకు మహిళా జెడ్పీటీసీలు, ఎంపీపీల నుంచి స్పందన కరువైంది. మంగళవారం నుంచి గురువారం వరకు మూడు రోజుల పాటు శిక్షణ ఇవ్వాలని జెడ్పీ అధికారులు నిర్ణయించారు. జెడ్పీ క్యాంపస్‌లోని డీపీఆర్‌సీ భవన్‌లో రెసిడెన్షియల్ శిక్షణ తరగతులు ఉంటాయని ఉమ్మడి అనంతపురం జిల్లా పరిధిలోని మహిళా ప్రజాప్రతినిధులకు కబురు పంపారు. అందరూ వస్తారని భావించినా తొలి రోజు మంగళవారం కేవలం ఇద్దరు మహిళా జెడ్పీటీసీ సభ్యులు హాజరయ్యారు. బుధవారం ముగ్గురు (ఇద్దరు జెడ్పీటీసీలు, ఒక ఎంపీపీ) మాత్రమే వచ్చారు. శిక్షణ తరగతులకు కనీసం 60 మంది వస్తారని ఊహించి, ఆ మేరకు భోజనాలు తెప్పించారు. అయితే ప్రజాప్రతినిధుల నుంచి స్పందన సరిగా లేకపోవడంతో భోజనాలన్నీ వృథా అయ్యాయి. ఆ వచ్చిన వారు కూడా ప్రభుత్వ తీరుపై అసహనం వ్యక్తం చేయడం గమనార్హం. ఇప్పటికే తమ పదవీ కాలం నాలుగేళ్లు పూర్తి కాగా, మరో ఏడాది కాలం మాత్రమే మిగిలి ఉందని, నాలుగేళ్లుగా లేని శిక్షణ చివరి ఏడాదిలో ఎందుకో అధికారులకే తెలియాలని పేర్కొన్నారు. కేవలం నిధులు వెనక్కి పోకుండా ఖర్చులు చూపించుకోవడానికే కార్యక్రమం ఏర్పాటు చేశారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

చీనీలో సమగ్ర యాజమాన్యం


డాక్టర్ మాధవి, ఉద్యాన శాస్త్రవేత్త

బుక్కరాయసముద్రం: చీనీ సాగులో సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటిస్తే మంచి దిగుబడులు సాధించవచ్చునని రైతులకు రెడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రం ఉద్యాన శాస్త్రవేత్త డాక్టర్ మాధవి తెలిపారు. గత ఏడాది టన్ను చీనీ ధర రూ. 90 వేలు నుంచి రూ.1.10 లక్షల వరకూ పలికింది. ప్రస్తుతం మార్కెట్‌లో టన్ను రూ.25 వేలతో అమ్ముడుపోతోంది. ఈ నేపథ్యంలో చీనీ సాగులో నాణ్యమైన అధిక దిగుబడులు సాధించేందుకు చేపట్టాల్సిన సమగ్ర యాజమాన్య పద్ధతులను 'సాక్షి'కి ఉద్యాన శాస్త్రవేత్త డాక్టర్ మాధవి వివరించారు.

- చీనీ సాగులో ప్రధానంగా మొక్క ఎంపిక చాలా ముఖ్యం. మొక్క ఎంపిక సరైనది కాకపోయినా, సమగ్ర ఎరువుల యాజమాన్యం పాటించకపోయినా, విపరీతంగా రసాయనిక మందులు వినియోగించినా, సూక్ష్మ పోషకాలు లోపించినా, సరైన నీటి యాజమాన్యం లేకపోయినా వేరు కుళ్లు, బంక తెగుళ్లు, నల్ల మంగు తదితర చీడపీడలు ఆశించే అవకాశముంది.
- రంగాపూర్ నిమ్మ వేరు మీద 15 సెంటీమీటర్ల ఎత్తులో అంటు కట్టి, చీడపీడలు ఆశించని 6 నెలల వయసున్న మొక్కలు ఆమోదం పొందిన నర్సరీ నుంచి సేకరించుకోవాలి. 1 మీటరు లోతు గుంత తీసి 20 కిలోల పశువుల ఎరువు, 100 గ్రాముల ట్రికోడెర్మా విరిడి, 2 కిలోల సింగిల్ సూపర్ ఫాస్పేట్, 100 గ్రాముల మిథైల్ పెరాథియాన్ కలిపి మొక్క నాటడానికి 15 రోజుల ముందు వేసి నీరు పెట్టాలి. నేల మట్టం నుంచి 15 సెంటీ మీటర్లు ఎత్తులో అంటు కలయిక భాగం ఉండేలా నాటుకోవాలి.
- నేలలో కర్బన శాతాన్ని పెంచడానికి 25 కిలోల జనుమును మొక్కల మధ్య అంతర పంటగా వేయాలి. 50 శాతం పూత వచ్చిన తరువాత జనుమును కలియ దున్నాలి. 25 శాతం పశువుల ఎరువు, 25 శాతం చెక్క, 50 శాతం సేంద్రీయ ఎరువులను వేయాలి. నత్రజని, పొటాష్ ఎరువులను రెండు దఫాలుగా వేసుకోవాలి. కాయ పెరిగే సమయంలో వేసుకున్నట్లయితే మొక్కకు పోషకాలు పెరిగి మంచి దిగుబడి సాధించవచ్చు. 500 గ్రాముల యూరియా, 250 గ్రాముల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ వేసుకోవడం ఎంతో మంచిది.



- లేత ఆకులు విచ్చుకున్న దశలో 15 నుంచి 20 రోజుల వ్యవధిలో రెండు సార్లు సూక్ష్మధాతు మిశ్రమాన్ని పిచికారీ చేయాల్సి ఉంటుంది. జింక్ సల్ఫేటు 500 గ్రాములు, మెగ్నీషియం సల్ఫేటు 200 గ్రాములు, ఫెర్రస్ సల్ఫేటు 200 గ్రాములు, బోరాన్ 100 గ్రాములు, యూరియా 1కిలో చొప్పున 100 లీటర్ల నీటికి కలిపి పిచికారీ చేయాలి.
- పూత, పిందె దశలో ఉన్నప్పుడు వేర్లు ఉన్న ప్రాంతాన్ని కదిలించరాదు. డ్రిప్పు ద్వారా నీటి తడులను సక్రమంగా ఇవ్వాలి. 9 లీటర్ల నీటికి 2 మి.లీ. ప్లానాఫిక్స్ కలిపి పూత, పిందె దశలో పిచికారీ చేయాలి. ఒకవేళ తెగుళ్ల వలన పిందె రాలుతుంటే లీటరు నీటికి కార్బండజిమ్ 1 గ్రాము కలిపి 10 రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేయాలి.
- కాయ సైజు పెరగడానికి నిమ్మ కాయ సైజులో ఉన్నప్పుడు లీటరు నీటికి 10 గ్రాములు చొప్పున పొటాషియం నైట్రేట్ 13.0.45 కలిపి 20 రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేయాలి. కాయలో నునుపుదనాన్ని పెంచడానికి లీటరు నీటికి 5 గ్రాముల సల్ఫేటు ఆఫ్ పొటాష్ కలిపి కాయ కోయడానికి నెల రోజుల ముందు పిచికారీ చేయాలి.

బావిలో పడి మహిళ మృతి

- ఆలస్యంగా వెలుగు చూసిన ఘటన

అమరాపురం: మండలంలోని పులికుంట గ్రామానికి చెందిన ముదియప్ప కుమార్తె నాగమ్మ (49) ప్రమాదవశాత్తు బావిలో పడి మృతి చెందింది. ఆలస్యంగా వెలుగు చూసిన ఘటనకు సంబంధించి వివరాలు... మతిస్థిమితంతో పాటు వైకల్యంతో బాధపడుతున్న నాగమ్మ అమరాపురంలో భిక్షాటనతో జీవనం సాగిస్తుండేది. ఈ నెల 11వ తేదీ నుంచి ఆమె కనిపించకపోవడంతో బంధువులు రవిచంద్ర, కృష్ణమూర్తి గాలింపు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో స్థానిక రైతు వాగేశప్ప పొలంలోని పాత బావిలో మహిళ మృతదేహాన్ని గుర్తించిన స్థానికుల సమాచారంతో పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని వెలికి తీయించారు. విషయం తెలుసుకున్న రవిచంద్ర, కృష్ణమూర్తి అక్కడకు చేరుకుని మృతురాలిని నాగమ్మగా ధ్రువీకరించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

అరకొర బస్సులతో ఇబ్బందులు


రద్దీగా ఉన్న బస్సులో ఎక్కేందుకు పోటీ పడుతున్న మహిళలు

బత్తలపల్లి: స్థానిక నాలుగు రోడ్ల కూడలి బుధవారం మహిళా ప్రయాణికులతో కిటకిటలాడింది. ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణం అందిస్తున్న ప్రభుత్వం అందుకు సరిపడిన బస్సులు అందుబాటులో ఉంచకపోవడంతో మహిళా ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. బుధవారం ఉదయం, సాయంత్రం కూడా ఇదే పరిస్థితి. అనంతపురం, కదిరి, ధర్మవరం, తాడిపత్రి వైపు వెళ్లే వారందరూ కూడలికి చేరుకుని బస్సుల కోసం గంటల తరబడి ఎదురు చూడాల్సి వచ్చింది. బస్సు రాగానే చుట్టుముట్టేస్తుండడంతో పరిస్థితి గందరగోళానికి దారి తీసింది. దీంతో పోలీసులు అక్కడకు చేరుకుని ప్రయాణికులను దగ్గరుండి బస్సులు ఎక్కించాల్సి వచ్చింది. అన్ని రకాల బస్సుల్లో ఉచిత ప్రయాణ వెసులుబాటు కల్పించాలని ఈ సందర్భంగా పలువురు మహిళలు డిమాండ్ చేశారు.

దోమలపై దండయాత్ర కొనసాగించండి


ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

పుట్టపర్తి అర్బన్: దోమలపై దండయాత్రను కొనసాగించాలని ప్రజలకు డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఫైరోజ్‌బేగం, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సునీల్‌కుమార్ పిలుపునిచ్చారు. ప్రపంచ దోమల నివారణ దినాన్ని పురస్కరించుకుని బుధవారం డీఎంహెచ్‌ఓ కార్యాలయం నుంచి వై జంక్షన్ వరకూ ర్యాలీ నిర్వహించి, మానవహారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కీటక జనిత వ్యాధులతో ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు. దోమలు అధికమైతే మలేరియా, డెంగీ, చికున్‌గున్యా, ఫైలేరియా తదితర వ్యాధులు సంక్రమిస్తాయన్నారు. కార్యక్రమంలో జిల్లా మలేరియా సహాయ అధికారి లక్ష్మీనాయక్, డిప్యూటీ డెమో ఫకృద్దీన్, సిబ్బంది పాల్గొన్నారు.

పెట్రోల్ బంకుల్లో ఎప్పటికప్పుడు ఆడిట్

అనంతపురం: జైళ్ల శాఖ పరిధిలోని పెట్రోల్ బంకుల్లో ఆడిట్ పక్కాగా నిర్వహిస్తామని జిల్లా ఉప కారాగారాల అధికారి ఈ.అనిల్ బాబు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ధర్మవరంలోని పెట్రోల్ బంకులో అక్రమాలు చోటు చేసుకున్న అంశంపై 'జైళ్ల శాఖ పెట్రోల్ బంకుల్లో అక్రమాలు' శీర్షికన బుధవారం 'సాక్షి'లో వెలువడిన కథనంపై ఆయన స్పందించారు. ధర్మవరం సబ్‌జైలు అధికారి బదిలీ అయిన సమయంలో హెడ్ వార్డెన్‌కు పెట్రోల్ బంక్ బాధ్యతలు అప్పగించారని, నగదు తక్కువగా ఉంటే అధికారులు చర్యలు తీసుకుంటారన్నారు.



వినీలాకాశంలో కనువిందు

పరిగిలో బుధవారం ఇంద్ర ధనుస్సు కనువిందు చేసింది. సాయంత్రం చిరుజల్లులు కురిశాయి. అదే సమయంలో ఎండ కాస్తుండగా ఏర్పడిన ఇంద్రధనుస్సు చూపరులను ఆకట్టుకుంది. – పరిగి:

భలే.. భలే ఊసరవెల్లి

జిల్లాలోని తోటల్లో తొండలు చాలా కనిపిస్తాయి. చాలా అరుదుగా ఊసరవెల్లి కనిపిస్తుంది. ఈ రెండింటికీ పోలిక ఉన్నా.. ప్రవర్తనలో చాలా తేడా ఉంటుంది. పల్లెల్లో అరుదుగా కనిపించే ఈ ఊసరవెల్లులు.. పట్టణ, నగర వాసులకు మాత్రం ఓ వింతగానే గోచరిస్తుంటాయి. బుధవారం పెనుకొండ పట్టణ సమీపంలోని మెడికల్ కళాశాల సమీపంలో రోడ్డు దాటుతూ ఓ ఊసరవెల్లి స్థానికులను అబ్బుర పరిచింది. దాని మనస్సులోని చిరాకు, భయం, కోపం లాంటి ఉద్వేగాలకు అనుగుణంగా రంగులు మారుస్తూ పొదల్లోకి వెళ్లడాన్ని ఆశ్చర్యంగా పరిశీలించారు.
– పెనుకొండ:


పొదల్లోకి వెళుతున్న ఊసరవెల్లి